ట్రాఫిక్ నియంత్రణలో అలసత్వం

చోటు చేసుకుంటున్న ప్రమాదాలు

చలాన్లు విధించడంపైనే సిబ్బంది శ్రద్ధ

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 29: ట్రాఫిక్ జామ్, రోడ్డు ప్రమాదాలు కాకుండా చూడాల్సిన అధికారులు, సిబ్బంది తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో లేని శ్రద్ధ కేవలం చలాన్‌లకు ఫొటోలు కొట్టేందుకు మాత్రమే ఉన్నట్లు ట్రాఫిక్ సిబ్బంది వ్యవహరిస్తున్నారని వాహనదారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్తాపూర్ చౌరస్తా, హైదర్‌గూడ ఈశ్వర్ థియేటర్ చౌరస్తా, పిల్లర్ నంబర్ 143, ఉప్పర్‌పల్లి, దుర్గానగర్, కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలతో రహదారులు ఎప్పుడు రద్దీగా ఉంటాయి. దీంతో ట్రాఫిక్ అధికారులు రహదారులపై ట్రాఫిక్ జామ్ కాకుండా, ప్రమాదాలు జరగకుండా సిబ్బంది విధుల నిర్వహణ కోసం ప్రధాన చౌరస్తాల వద్ద ట్రాఫిక్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి చౌరస్తాలో ఈ బూత్‌లు ఉంటాయి తప్ప అందులో ట్రాఫిక్ కానిస్టేబుల్ మాత్రం కనిపించడు.

అత్తాపూర్ చౌరస్తా, హైదర్‌గూడ ఈశ్వర్ థియేటర్ చౌరస్తా, హైదర్‌గూడ పిల్లర్ నంబర్ 143 చౌరస్తా వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్ లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న ట్రాఫిక్ బూత్

చోటు చేసుకుంటున్న ప్రమాదాలు

వాహనాదారులు చౌరస్తాల వద్దకు వచ్చిన సమయంలో ట్రాఫిక్ సిబ్బంది ఉంటేనే నియమనిబంధనలు పాటిస్తారు. ట్రాఫిక్ సిబ్బంది ఉంటే సదరు వాహనాదారులు రెడ్ సిగ్నల్ పూర్తిగా అయి గ్రీన్ సిగ్నల్ వచ్చే వరకు వేచి ఉండి వెళతారు. వాహనాదారులు వచ్చే సమయంలో కానిస్టేబుల్స్ లేకపోవడంతో రెడ్ సిగ్నల్ పడినా, వాహనాలు అడ్డుగా ఉన్నా అవేమి చూడక వాహనాన్ని ముందుకు వేగంగా పోనిస్తారు. ఈ సమయంలోనే ముందు వెళ్తున్న వాహనాలను వెనుకనుంచి వచ్చిన వాహనాలు ఢీకొనడం, యూటర్న్ చేసుకునే సమయంలో ఢీకోనడం తదితర సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వాహనాదారులు ఇష్టానుసారంగా ప్రయాణిస్తూ ఇతర వాహనాలను ఢీకొనడం, అక్కడ గొడవలు జరగడం సర్వసాధారణంగా మారాయి.

చలాన్‌ల కోసం చాటున ఉండి ఫొటోలు తీస్తున్నారు..

ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు వాహనాల క్రమబద్ధీకరణను గాలికి వదిలేస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద చాటుగా ఉండి హెల్మట్ లేని వాహనాలు, సీట్‌మెల్ పెట్టుకోని కార్లు, త్రిబుల్ రైడింగ్ ఇలా వారికి చలాన్‌లను వేసే పనిలో మాత్రమే నిమగ్నమై ప్రజల సమస్యలను పట్టించుకోవడమే మానేశారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. చలాన్‌ల ఫోటోలు కోట్టడంలో ఉన్న శ్రద్ధను ట్రాఫిక్ జాములు, ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని వాహనాదారులు కోరుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి చౌరస్తాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బూత్‌లలో సిబ్బంది ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పగిలిన నీటి పైపులైన్‌కు మరమ్మతు

మణికొండ, జూలై 29: మున్సీ చెరువు వద్ద పైపులైన్ పగిలిపోవడంతో లీకేజీని అరికట్టేందుకు సింగూరు నుంచి ఖానాపూర్ వరకు భోజగుట్ట వరకు 1200 ఎంఎం డయా పీఎస్‌సీ గ్రావిటీ మెయిన్‌ను అత్యవసరంగా నిలిపివేస్తున్నట్టు జలమండలి అధికారులు తెలిపారు. తత్కాలికంగా ఓఅండ్‌ఎం డివిజన్ 18 పరిధిలో మణికొండ, నార్సింగి, మంచిరేవులలో నీటి సరఫరా ప్రభావితమవుతుందని పేర్కొన్నారు. షేక్‌పేట్, బోజగుట్ట రిజర్వాయర్ కమాండింగ్ ప్రాంతాల్లో అల్పంగా సరఫరా ఉంటుందన్నారు. ఈ పైపులైన్ చాలా పాతదని గతంలో సుమారు 10 ఎంజీడీ డ్రా చేసేదన్నారు. కానీ ఇప్పుడు పెరిగిన నీటి డిమాండ్‌కు అనుగుణంగా కొన్ని చోట్ల పైపులైన్‌ను పటిష్టం చేయడం ద్వారా 16 ఎంజీడీ ఇస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఈ పైపులైన్‌ను మరింత బలోపేతం చేయనున్నామన్నారు. మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల ధర్నాకు తరలిరావాలి

శంషాబాద్ రూరల్, జూలై 29: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధర్నాకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటిని విస్మరించిందని అన్నారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్లతో పాటు సమస్యలను విన్నవించడం కోసం నగరంలోని ఇందిరాపార్కు వద్ద మంగళవారం తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం, కాంట్రక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. పర్మినెంట్ కార్మికులను ఇతర మున్సిపాలిటీలకు బదిలీ చేయొద్దన్నారు. కార్మికులకు రెండో పీఆర్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వరుస ప్రమాదాలతో పోలీసుల అలర్ట్

ఖైరతాబాద్, జూలై 29: ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై వరుస రోడ్డు ప్రమాదాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 21, 22 తేదీల్లో ఫ్లై ఓవర్‌పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతిచెందిన విషయం తెలిసిందే. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేని ప్రయాణమే వారి ప్రాణాలు తీసినట్లు పోలీసు విచారణలో తేలింది. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి నెక్లెస్‌రోడ్ వెళ్లే దారిలో మూలమలుపు ఉంది. అలాగే అటు నుంచి వస్తున్న వాహనాలకు అలాంటి ముప్పే పొంచి ఉంది. ఇది కూడా ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో లాండ్ అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ట్రాఫిక్ ఇంజినీరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఆర్టీఏ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జీహెచ్‌ఎంసీ డీఈ చైతన్య సోమవారం ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌ను నిషితంగా పరిశీలించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. తక్షణమే ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, ఫ్లై ఓవర్ రెండు వైపులా రంబుల్ స్ట్రిప్స్, ట్రాఫిక్ సైన్ బోర్డులు, ఫ్లై ఓవర్‌పై ఓవర్ టేకింగ్‌పై నిషేధాజ్ఞలు, వేగ పరిమితి, మూలమలుపు, నిదానంగా వెళ్లడం లాంటి సూచిక బోర్డులతో పాటు రాత్రివేళల్లోనూ వాహనదారుడికి స్పష్టంగా కనిపించేలా రెట్రో రిఫ్లెక్టివ్ సైన్ బోర్డుల ఏర్పాటుతోపాటు చెట్ల కొమ్మలు తొలగింపు లాంటి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు, ఆర్టీఏ, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఘనంగా ఫలహారబండ్ల ఊరేగింపు

హిమాయత్‌నగర్, జూలై 29: బోనాల ఉత్సవాల్లో భాగంగా హిమాయత్‌నగర్‌లోని వివిధ ప్రాంతాల్లో సోమవారం ఘటాలు, ఫలహారబండ్ల ఊరేగింపు వైభవంగా జరిగాయి. పలు బస్తీలు, ఆలయాల వద్ద డప్పు వాయిద్యాలు, పోతరాజుల నృత్యాల నడుమ బోనాల ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. పలువురు ప్రత్యేకంగా అలంకరించిన ఫలహార బండ్లను పొట్టెళ్ల సహాయంతో, మేళతాళాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు తరలించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ కార్పొరేటర్ జె.హేమలతయాదవ్, బీఆర్ఎస్ నాయకులు జె.బాబుయాదవ్, కృష్ణయాదవ్, కొల్కుల శ్రీకాంత్, సుదర్శన్ పాల్గొని పూజలు చేసి ఫలహారబండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఫలహారబండ్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న హేమలతయాదవ్

దక్షిణాదిలో నంబర్ వన్ క్లబ్ ఎఫ్ఎన్‌సీసీ

జూబ్లీహిల్స్, జూలై 29: దక్షిణాదిలో నంబర్ వన్ క్లబ్‌గా పేరున్న ఫిలింనగర్ కల్చరల్ క్లబ్ విభిన్న కార్యక్రమాలకు నిలయమని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఆదివారం ఎఫ్ఎన్‌సీసీ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి వర్మను ఘనంగా సన్మానించారు. సీనియర్ నటులు మాగంటి మురళీమోహన్, సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ, తెలుగు ఫిలిం చాంబర్ సెక్రటరీ కేఎల్ దామోదరప్రసాద్, తెలుగు నిర్మాతల మండలి సెక్రటరీ టి.ప్రసన్నకుమార్, సంస్థ కార్యదర్శి ముళ్ళపూడి మోహన్, సంయుక్త కార్యదర్శి వీవీఎస్ఎస్ పెద్దిరాజు, ఏడిద రాజు, సామా ఇంద్రపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గండిపేటలో శ్మశానవాటికను కాపాడండి

గండిపేట శ్మశానవాటిక వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మణికొండ, జూలై 29: శ్మశానవాటికను సైతం కబ్జాదారులు వదలడం లేదని గండిపేట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు వందేళ్ల క్రితం నుంచి తమ పూర్వీకుల సమాధులను అక్కడే చేస్తారని తెలిపారు. కొందరు పరోక్షంగా స్థానిక మున్సిపాలిటీ అధికారులతో కుమ్మక్కై శ్మశానవాటికలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ గండిపేటకు చెందిన దళితులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం దాదాపు 100 కుటుంబాలకు చెందిన గ్రామస్తులు శ్మశానవాటికను కాపాడాలంటూ డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఇతర సిబ్బంది సహకారంతో శ్మశానవాటికలో బహుళఅంతస్తుల నిర్మాణాన్ని చేపట్టడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో శ్మశానవాటికలు లేకపోతే ప్రైవేటు భూముల్లో ఉంటాయా అంటూ ప్రశ్నించారు. శ్మశానవాటిక భూములను కబ్జా చేస్తుంటే పట్టించుకోవాల్సిన గండిపేట రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. సమస్యను పరిష్కరించకపోతే గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి దీక్షకు దిగుతామని గండిపేట హిందూ శ్మశానవాటిక బాధిత కుటుంబాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో సుధాకర్, రాము, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులతో చెలగాటం

శంషాబాద్ ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

శంషాబాద్ రూరల్, జూలై 29: మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రభుత్వం చెలగాటమాడుతుందని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ పేర్కొన్నారు. సోమవారం శంషాబాద్ ఎంఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులతో చెలగాటమాడుతుందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు భోజనం పెట్టే కార్మికులను కాదని, ప్రైవేటు సంస్థకు నిర్వహణ బాధ్యత అప్పగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే.. మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షుడు గణేశ్, కార్మికులు పాల్గొన్నారు.

అత్తాపూర్ నుంచి రాంబాగ్ వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న మూగజీవాలు

ప్రధాన రోడ్లపై మూగజీవాల తిష్ట

ఇబ్బందుల్లో వాహనాదారులు, ప్రయాణికులు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 29: ప్రధాన రహదారులపై మూగజీవాల సంచారంతో వాహనాదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అత్తాపూర్, హైదర్‌గూడ, రాంబాగ్, పాండురంగానగర్ తదితర ప్రాంతాల్లో మూగజీవాలు రోడ్లపైనే తిష్టవేయడంతో సమస్య ప్రమాదభరితదంగా మారింది. ఆవులు, బర్రెలు, మేకలు, కుక్కలు ప్రధాన రహదారులపై నిత్యం సేదతీరుతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులను సృష్టిస్తున్నాయని స్థానికులు, వాహనాదారులు వాపోతున్నారు. స్థానికంగా మూగజీవాలను పెంచుకునే వారు మేత కోసం వాటిని వదులుతున్నారు. దీంతో అవి ఎటు వెళ్లాల్లో తెలియక ప్రధాన రహదారులపైకి చేరుతున్నాయి. అక్కడే తిష్టవేసిన తాపీగా నెమరేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇటుగా వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు వెళ్లేందుకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుంది. అసలే వాహనాలు అధికంగా తిరిగే రోడ్లు కావడంతో ఇబ్బంది ఎదురవుతుందని పలువురు ప్రయాణికులు, వాహనదారులు వెల్లడిస్తున్నారు. అలాగే ఈ రహదారులపై అనేక ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఈ విషయంలో జీహెచ్ ఎంసీ అధికారులు మూగజీవాల యజమానులను గుర్తించి రోడ్లపై వదిలి వేయకుండా చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.

బదిలీల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం

ఖైరతాబాద్, జూలై 29: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలోని ఆయుర్వేద విభాగం ఉద్యోగుల బదిలీల్లో జీవో నం.80లోని అంశాలను అమలు చేయాలని అఖిల భారత షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల హక్కుల పరిరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి రాసూరి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కొందరు అధికారులు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 40 శాతం ఉద్యోగులను బదిలీ చేయాలన్న నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు 20 ఏండ్లు ఒకే దగ్గర పనిచేసిన వారిని వదిలి ఐదేండ్లు పనిచేసిన వారిని బదిలీ చేస్తున్నారన్నారు. ఈ ప్రక్రియలోనూ అవకతవకలు జరుగుతున్నాయని, కౌన్సిలింగ్‌కు సీనియర్‌ను ముందు పిలువాల్సి ఉండగా, జూనియర్లను పిలిచి వారికి అనువైన స్థానాలను కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాతే మిగిలిపోయిన వాటిని సీనియర్లకు కేటాయిస్తున్నారని, ఇందులోనూ ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరుగడం లేదన్నారు. దీనిపై ఇప్పటికే అయూష్ డైరెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

PUBLIC NOTICE

This is to inform to the general public that my client Smt. SEELAM SUMA PRIYA, W/o. Seelam Venkata Satya Bala Bapeswara Rao issuing this public notice that my client that received the gift of property i.e., House bearing Municipal No. 8-4-369/278/J/S.III, (PTI No.: 1100804283), admeasuring 116 Square Yards or 96.976 Square Meters, situated at N.R.R. Puram, Site-3, Borabanda, Hyderabad, T.S., Ward No. 8, Block No. 4 and bounded as NORTH: 30 Feet Road, SOUTH: House No. 302 & 282-I, EAST: House No. 277-J, WEST: House No. 279-J from Sri SEELAM TATHA RAO through registered GIFT DEED vide Document No. 3114/2021, Dated 30th day of April, 2021 at S.R.O. Banjara Hills, Hyderabad. The above said property received from my client's Uncle Sri SEELAM TATHA RAO which was purchased by my client's Uncle from THE NUKALA RAMACHANDRA REDDY PURAM GOVT. CLASS IV. EMPLOYES DRIVERS AND OTHER LOW PAID EMPLOYEES COOPERATIVE HOUSING SOCIETY LIMITED (REGD. NO. TAB-137), located at Society Office at H.No. 8-4-379/282/E, Site-I, N.R.R. Puram Colony, Borabanda Hyderabad-18, represented by it's President Sri M. NARASIMHA REDDY through Registered SALE DEED vide Document No. 1940/2009, Dated 9th July, 2009 at Joint Sub-Registrar, Hyderabad (South). The said property link Document i.e., SALE DEED DOCUMENT, Document No. 1940/2009 was lost while House Shifting on 26-07-2024, Time is 4.00 PM. If anybody in the possession of the Original Document relating to the said property, they are hereby requested to handover the same to the below address.

ASHOK KUMAR PODUGU, Advocate
D.No. 7-1-406, Flat No. 103, Sai Residency, Balkampet Road, Ameerpet,
Off. Cell: 9966957004.
Hyderabad, Dated 29-07-2024.

పొదుపు సంఘాలకు బీమా

త్వరలో.. అమలు కానున్న పథకం
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు
- సాధారణ మరణానికి రూ.2 లక్షల వర్తింపు

లోన్ బీమా పథకంపై పొదుపు సంఘాలకు అవగాహన కల్పిస్తున్న జూబ్లీహిల్స్ యూసీడీ సర్కిల్ అధికారులు (ఫైల్)

జూబ్లీహిల్స్, జూలై 29: పొదుపు సంఘాల సభ్యులకు లోన్ బీమా పథకం అమలు చేసేందుకు నగర పాలక సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యునిటీ డెవలప్‌మెట్ (యూసీడీ) విభాగం ఆధ్వర్యంలో ఈ బీమా పథకం అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తూ స్త్రీనిధి పోర్టల్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యుల ఎన్‌రోల్‌మెంట్ ముమ్మరంగా చేపడుతున్నారు. స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ద్వారా బీమా పథకం అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి విశేషంగా దోహదపడిన సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు కొత్తగా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు తెలిపారు. పొదుపు సంఘాల సభ్యులు ప్రమాద వశాత్తు మరణిస్తే రూ.10లక్షల ప్రమాద బీమా కుటుంబ సభ్యులకు అందజేస్తారు. ఆయా సంఘాల్లో సభ్యులు సాధారణ మరణం సంభవిస్తే రూ.2లక్షలు జీవిత బీమా అందజేయనున్నారు. స్వయం సంఘాల్లో సభ్యులుగా నమోదైన వారు టౌన్ లెవల్ ఫెడరేషన్ పరిధిలోని స్లమ్ లెవల్ ఫెడరేషన్‌లో నమోదై ఉండాలి. ఆయా సభ్యులకు ఒక ఐడీ, గ్రూపులకు ఒక ఐడీ కేటాయిస్తారు. ఈ నిబంధనల ప్రకారం కొనసాగుతున్న గ్రూపులను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పోర్టల్‌లో నమోదు చేస్తారు. నిబంధనల ప్రకారం నమోదైన గ్రూపు సభ్యులకు లోన్ బీమా పథకాలు వర్తింపజేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

స్త్రీనిధి పోర్టల్‌లో ఉన్న వారికే..

స్త్రీనిధి పోర్టల్‌లో ఉన్న వారికే లోన్ బీమా పథకం వర్తిస్తుంది. ప్రతి గ్రూపు సభ్యులు నిబంధనల ప్రకారం నమోదై ఉండాలి. ఇందులో భాగంగా గ్రూపుల్లో సభ్యులకు గుర్తింపు (ఐడీ) నంబర్ కేటాయిస్తున్నాం. తద్వారా లోన్ బీమా పథకం వారి కుటుంబాలకు వర్తిస్తుంది.

– ఆశా వెరోనికా, యూసీడీ డీపీఓ

ఐదు వారాల పాటు సాక పెట్టాలి

ఖైరతాబాద్, జూలై 29: ఐదు వారాల పాటు తనకు పదకొండు మంది ముత్తైదువులు సాక పెట్టాలి, ఈ సారి కుంభవృష్టి వర్షాలు పడుతాయని.. భక్తులను కాపాడే బాధ్యత తనదేనని లాల్ బజార్‌కు చెందిన రేణుకా మాతా భవిష్య వాణి వినిపించారు. ఖైరతాబాద్‌లోని మహంకాళి దేవస్థానంలో సోమవారం రాత్రి రంగం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవాని కృష్ణ యాదవ్, అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శి మధుకర్ యాదవ్, కోశాధికారి బాలయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ బహుమతులు ప్రదానం

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 29: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని మహవీర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ సంరెడ్డి జయలక్ష్మి. కళాశాల జాయింట్ సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ప్రతిభకనబరిచిన క్రీడాకారులకు నగదు బహుమతితో పాటు మెడల్స్ అందజేశారు. టీఎస్‌టీటీఏ అసోసియేషన్‌కు క్రీడాభివృద్ధి కోసం రూ.70 వేల నగదు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌టీటీఏ ప్రధాన కార్యదర్శి నరేశ్‌రెడ్డి, ప్రకాశ్‌రాజ్, ఉదయ్‌రాజు, లక్ష్మికాంత్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు, తొట్టెల ఊరేగింపు

తొట్టెల ఊరేగింపులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 29: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు అమ్మవార్లకు బోనం నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి, మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డినగర్, గగన్ పహాడ్ ప్రాంతాల్లో వేడుకలు జరిగాయి. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తొట్టెల ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌గౌడ్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.ధనుంజయ్, యువజన నాయకులు శివ, శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఎం.శేఖర్, టి.శ్రీశైలం, రాజు, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రహ్మత్‌నగర్‌లో బోనమెత్తుకున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి. – జూబ్లీహిల్స్

దోపిడీకి యత్నం

వెంగళరావునగర్, జూలై 29: బోనాల నుంచి తిరిగొచ్చి రోడ్డు పక్కన కారును పార్కింగ్ చేసి నడుకుంటూ వెళ్తున్న వ్యక్తిని దారిలో అటకాయించి దోపిడీకి యత్నించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. వెంగళరావునగర్ కాలనీలో ఉండే శైలేశ్ కుమార్ సింగ్(38) తన స్నేహితుడు లోకేశ్వర్‌తో పాటు కుటుంబ సభ్యులతో కలిసి నారాయణగూడలోని బోనాల పండుగకు వెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక వెంగళరావునగర్ కాలనీలోని రోడ్డు పక్కన కారు పార్కింగ్ చేసి.. అయ్యప్ప గ్రౌండ్ వైపు నుంచి నడుచుకుంటూ వెళ్లసాగాడు. అటుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతని చొక్కా పట్టుకుని దాడి చేశారు. శైలేశ్ కుమార్ సింగ్ జేబుల్ని చూసినా వారికి డబ్బు కనిపించలేదు. వారి నుంచి తప్పించుకొని సమీపంలోని స్నేహితుడి ఇంట్లోకి వెళ్లాడు. ఇంటి యజమానురాలు శోభారాణి, ఆమె కుమారుడు లోకేశ్వర్, స్థానికుడు శేఖర్ అడ్డుకున్నారు. దాడికి పాల్పడింది ఉమేశ్, వివేక్ అని స్థానికుల ద్వారా తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పంజాగుట్ట పీఎస్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ

ఖైరతాబాద్, జూలై 29: పంజాగుట్ట పోలీసు స్టేషన్‌ను వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెస్ట్‌జోన్ పరిధిలో సెల్‌ఫోన్ చోరీ కేసుల్లో ఓ దొంగల ముఠాకు సహకరిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కానిస్టేబుల్, హోంగార్డుపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లు, అందులో విధులు నిర్వహిస్తున్న సీఐ, ఎస్సైలు, సిబ్బందిపై ప్రత్యేక నజర్ పెట్టినట్లు సమాచారం. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో ఫైళ్ల నిర్వహణ, నేరాల పరిశోధన, సిబ్బంది పనితీరును తెలుసుకొనేందుకు డీసీపీ ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు చెబుతున్నారు.